ఠంగ్... ఠంగ్...

సమయం 3-45 కావొస్తూండగా అటెండర్ సరస్వతమ్మ గంట కొట్టింది.

అది పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కాలేజ్.

సెకెండ్ ఫ్లోర్‌లో సివిల్ ఫైనల్ ఇయర్ క్లాస్ నుంచీ అప్పుడే మెట్లు దిగి వస్తున్నారు ప్రిన్సిపాల్- శిలాదిత్య. ఆయన వయసు 45 ఏళ్ళు పై బడినా ఆరోగ్యకరమైన శరీర సౌష్టవం. నడకలోని హుందాతనం ఆయన వయసును మరో ఐదేళ్ళు తగ్గించే చెబుతాయి. ఆ కాలేజీ లోని అమ్మాయిలకే కాదు, అక్కడ పని చేసే ప్రతి వ్యక్తికీ శిలాదిత్య అంటేనే అదో గౌరవంతో కూడిన భయం. కేవలం చూపు లతోనే శాసించగల వ్యక్తి శిలాదిత్య.

ఢిల్లీలో చేస్తున్న ఇంజనీరు ఉద్యోగాన్ని వొదిలేసి నేటివ్ ప్లేస్ మీద అభిమానంతో ఇక్కడికొచ్చి ప్రిన్సిపాల్‌గా స్థిరపడ్డాడు. శిలాదిత్యను మిత భాషి అనడం కంటే స్వల్పభాషి అనడం మేలేమో. క్లాస్‌లో ఇచ్చే లెక్చర్ తప్పించి మిగిలిన సందర్భాల్లో చాలా తక్కువగా మాట్లాడుతాడాయన. ఏదో ఆలోచించుకుంటూ, ఎప్పుడూ ఒంటరిగా కనిపించే శిలాదిత్యజీవితం చాలా మందికి ఓ పజిల్‌లా అనిపిస్తుంది.

మెట్లుదిగి వస్తూ గ్రౌండ్‌లోకి చూసిన శిలాదిత్య ఒక్క క్షణం అలాగే నిలబడిపోయాడు-

# లవ్ స్టోరీ

## ఫ్లయింగ్ కిస్

గేట్ దగ్గర దానిమ్మచెట్టు ప్రక్కన నిలబడ్డ ఓ అమ్మాయి తనకేసి చూస్తూ ఫ్లయింగ్ కిస్ ఇస్తోంది.

"ఎంత ధైర్యం?" తీక్షణంగా చూశాడా అమ్మాయికేసి.

ఒక్కక్షణం వెనక ఎవరైనా ఉన్నారేమోనన్న అనుమానంతో వెనక్కి తిరిగి చూశాడు. లాండింగ్ పైన గానీ స్టెప్స్‌పైన గానీ ఎవ్వరూ లేరు. అందరూ క్లాస్‌రూమ్స్‌లో వున్నారు. "మరి ఎవరికి ముద్దిస్తోందీ అమ్మాయి!" అనుకొంటూ ఆ అమ్మాయికేసి చూశాడు. ఆ అమ్మాయి ఎప్పటిలాగే నవ్వుతూ అరచేతితో ముద్దు పెట్టి తనకేసి చూస్తూ ఉఫ్ మంటూ ఊదింది.

"ఇడియాటిక్ ఫెలో" కసిగా పళ్ళు కొరికాడు శిలాదిత్య.

స్టెప్స్ దిగుతుండగానే చేతిలోని బుక్ అందుకోవడానికి సరస్వతమ్మ వచ్చింది. బుక్ ఇచ్చేసి గ్రౌండ్ కేసి చూపిస్తూ అన్నాడు శిలాదిత్య "ఆ దానిమ్మ చెట్టు దగ్గర నిలబడ్డ అమ్మాయిని నా గదికి పంపించు."

"అలాగేసర్" అంటూ గ్రౌండ్ లోకి వెళ్ళింది సరస్వతమ్మ.

అప్పుడా అమ్మాయి దానిమ్మ పూలను కోసుకొని టెక్స్ట్‌బుక్‌లో జాగ్రత్తగా ప్రెస్‌చేసి పెట్టుకుంటోంది.

"నిన్ను ప్రిన్సిపల్ సర్ రమ్మంటున్నారమ్మా" అన్న పిలుపుకు చివాలున వెనక్కి తిరిగి చూసిందా అమ్మాయి.

"నన్నా! ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది.

"తెలీదు" అనేసి వెళ్ళిపోయింది సరస్వతమ్మ.

టెక్స్ట్‌బుక్‌లోని దానిమ్మ పూలు జారిపోకుండా జాగ్రత్తగా పట్టుకొని ప్రిన్సిపాల్ రూం కేసి నడుస్తోందా అమ్మాయి. మనసంతా అదో రకమైన టెన్షన్. "నన్నెందుకు పిలిపించారు. బహుశ నేను దానిమ్మ పూలను కోసుకుంటుండడం ప్రిన్సిపల్ చూశారేమో. కాలేజ్‌కు సంబంధించిన చెట్ల నుంచీ ఆకులు, పువ్వులు, కొమ్మలు లాంటివి ఏవి తుంచినా ప్రిన్సిపల్ సహించరని సీనియర్స్ చెప్పగా విందితను. ఇప్పుడెలా?" ఆలోచిస్తూ ప్రిన్సిపాల్ రూంలోకి అడుగు పెట్టింది.

"హాస్టలర్ వా? డేస్కాలర్ వా?" ప్రశ్నించాడు శిలాదిత్య.

"హాస్టలర్‌ని సర్" అంది భయపడుతూనే.

"దానిమ్మ చెట్టు దగ్గర ఏం చేస్తున్నావ్" కటువుగా ప్రశ్నించాడు శిలాదిత్య.

ప్రిన్సిపల్ అంత కోపంతో వుండగా ఎప్పుడూ చూడని ఆ అమ్మాయి ఒక్క సారిగా భయపడిపోయింది. వణుకుతున్న కంఠంతో అంది. "సారీసర్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ"

**"Don't behave as a fool.** హాస్టల్ నుంచి సీట్ తీసేస్తున్నాను. ఇంటికి లెటర్ వ్రాసి వారం రోజుల్లోపల హాస్టల్ ఖాళీ చేసెయ్" అన్నాడు. కోపంగా కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లుతుండగా ఏడుస్తూంది. "ఐ బెగ్ యువర్ పార్డన్ సర్. ఇంకెప్పుడూ అలా చెయ్యను సర్. ఈ ఒక్కసారికి నన్ను క్షమించండి సర్" "గెట్ అవుట్ ఫస్ట్ ఐసే" విసురుగా అన్నాడు శిలాదిత్య.

ఏడుస్తూనే ప్రిన్సిపల్ రూంలోంచి బయటకు వచ్చింది.

"అరె శైలూ! ఏమైందే? ఎందుకేడుస్తున్నావ్!" భుజం పట్టి కుదుపుతూ ఆత్రంగా ప్రశ్నించింది. కల్హార శైలూ ఫ్రెండ్.


"ప్రిన్సిపల్ సర్ నన్ను తిట్టారు. హాస్టల్ లోంచి తీసేస్తారట." వెక్కుతూనే అంది శైలూ.

"నిన్నా? ప్రిన్సిపల్ సర్ తిట్టారా? ఎందుకు?"

"నేను దానిమ్మ పూలు కోసుకుంటుండగా చూసినట్టున్నారు. పిలిపించి తిట్టారు."

"వ్హాట్? దానిమ్మ పూలు కోసుకున్నందుకు హాస్టల్ నుంచి తీసేస్తారా? ఇదెక్కడి న్యాయం?"

ఇద్దరూ అలా మాట్లాడుకుంటుండగానే



మరో నలుగురమ్మాయిలు గుమికూడారక్కడ 'ఏమైంది?' అంటూ. జరిగిన విషయం కల్హార చెప్పింది వాళ్ళకు.

"అయినా దానిమ్మ పూలెందుకు కోశారే శైలూ" అడిగిందో అమ్మాయి.

"ఏముంది. ఈవిడ పెద్ద ఆర్టిస్ట్ కదా. ఏ గ్రీటింగ్స్ తయారు చేసికోవడానికో కోసుకో మంటుంది" అంది మరో అమ్మాయి.

"ఈ రోజు దానిమ్మ పూలు కోసుకున్నం దుకు హాస్టల్ నుంచి తీస్తేస్తారు. రేపొద్దున్న పొరపాట్న ఏ మొక్కను తొక్కేసినా కాలేజ్ నుంచే తీసేసేటట్టున్నారు. ఏం క్రమశిక్షణో ఏమో" విసుక్కుందో అమ్మాయి.

"అవును. మరీ ఇంత ఓవర్ డిసిప్లిన్ ఏ కాలేజ్‌లోనూ లేదు శైలూ నువ్వేం కంగారు పడకు. మే మందరం స్ట్రైక్ చేసైనా సరే నీకు హాస్టల్‌లో సీట్ ఇప్పిస్తాం. పద ప్రెసిడెంట్‌తో మాట్లాడుదాం" అంది కల్హార ఆవేశంగా.

ఇంతలో ప్రెసిడెంట్ సుజాత ఎదురొచ్చింది. జరిగిన విషయం చెప్పింది కల్హార. ఏడుస్తూ అంది శైలూ "కాలేజ్‌కు సంబంధించిన చెట్లనుంచి పూలు కోయడం కాలేజ్ రూల్స్‌ని అతిక్రమించినట్టే కదా. తప్పు ఎవ్వరు చేసినా శిక్ష అనుభవించాల్సిందే. ప్లీజ్ మీరు నా కోసం స్ట్రైక్స్ లాంటివేం చెయ్యకండి."

సుజాత అంది "తను వొద్దంటుంటే మనం మాత్రం ఏం చెయ్యగలం? అయినా హాస్టల్ నుంచి తీసేస్తా నన్నారేగాని ఇంకా నోటీస్ ఇవ్వలేదు కదా. నోటీస్ ఇచ్చిన అప్పుడు చూద్దాం" శైలూ వైపు తిరిగి "హాస్టల్‌లోంచి తీసేస్తారన్నది ఒట్టి బెదిరింపే. నువ్వేం కంగారు పడకు. ఇంత చిన్న విషయానికే ప్రిన్సిపల్ నిన్ను హాస్టల్ నుంచి తీసెయ్యరు. డోంట్ వర్రీ" అని భుజం తట్టేసి వెళ్ళిపోయింది సుజాత. శైలూను ఓదార్చుతూ హాస్టల్‌కు పిలుచుకెళ్ళింది కల్హార.

మరునటి రోజు.

సాయంత్రం నాలుగు గంటలు కావొస్తోంది. వర్షం సన్నటి తుంపర్లుగా పడుతోంది. మరో వైపు నుంచి వెచ్చటి సీరెండ. ఆహ్లాదకరమైన వాతావరణం. లాబ్ నుంచి తన రూంకేసి నడుస్తూ యథాలాపంగా గ్రౌండ్‌కేసి చూసిన శిలాదిత్య ఒక్క క్షణం నివ్వెరపోయాడు.

ఆ అమ్మాయి గ్రౌండ్‌లో నిలబడి బిల్డింగ్ కేసి చూస్తూ ఫ్లయింగ్ కిస్ ఇస్తోంది. ఒక్కసారి బిల్డింగ్ కేసి చూశాడు. ఎవ్వరూ లేరు. అలాగే పైకి చూపు సారించాడు.

'ఆకాశంలో రంగుల హరివిల్లు'

ఓహ్... ఒక్క క్షణం పరవశించి పోయాడు శిలాదిత్య.

ఒక్కసారిగా అతనికి గతం గుర్తుకొచ్చింది.

తను ఇంటర్ చదివే రోజుల్లో ఇలాగే మనసుకు నచ్చిన ఏ దృశ్యం కన్పించినా ఫ్లయింగ్ కిస్ పంపించేవాడు. ఓసారి హరివిల్లుకు ఫ్లయింగ్ కిస్ పంపిస్తుండగా మేడపై నుంచి చూసిన సమీర ఆ ముద్దు తనకే ననుకొని తనను తిట్టడం, అసలు విషయం తెలిశాక తనూ, సమీర క్లోజ్ ఫ్రెండ్స్ కావడం... ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి. గతం తాలూకు జ్ఞాపకాలతో బరువెక్కిన గుండెతో ఆ అమ్మాయి

కేసి చూశాడు. తనవైపే చూస్తున్న ప్రిన్సిపల్ కేసి బెదురు చూపుల్తో చూసింది శైలూ. రమ్మన్నట్టుగా తలూపాడు. దగ్గరికెళ్ళి నిల బడింది.

"కాలేజ్ అవర్స్ అయిపోయాక ఓసారి నా రూంకురా" అనేసి తన రూంకేసి వెళ్ళి పోయాడు శిలాదిత్య.

4-35 కావొస్తుండగా ప్రిన్సిపల్ రూం దగ్గరకెళ్ళింది శైలూ.

"ఎక్స్క్యూజ్ మీ సర్"

"ఎస్ కమిన్"

తడబడుతున్న అడుగుల్తో టేబిల్ దగ్గరి కెళ్ళి నిలబడింది శైలూ.

"నేటివ్ ప్లేస్ ఏది?" మృదువుగా ప్రశ్నిం చాడు.

"విజలాపురం సర్" అంది భయపడు తూనే. అప్పుడు సమీర వుంటున్నది విజలా పురంలోనే కదూ అని ఆలోచించుకుంటూ అడిగాడు శిలాదిత్య "నీ పేరు?"

'శైల సమీర"

ఓహ్... శైల సమీర. గుండెలోతుల్లో ఎక్కడో సన్నటి కదలిక- పేరు వినగానే. ఉప్పొంగుకొస్తున్న ఉద్వేగాన్ని కంట్రోల్ చేసికుంటూ అన్నాడు శిలాదిత్య.

**"You see my Child. You can enjoy the purity of the purest articles in the world. My warm wishes are always with you my Child. You can go now"** అన్నాడు సీలింగ్ కేసి చూస్తూ.

"మై చైల్డ్" అన్న పిలుపు ప్రభావమేమో అంతవరకు ప్రిన్సిపల్ అంటేనే భయంతో వొణుకుతున్న శైలూ **"Thanks a lot to you Uncle."** అంది ఆనందాన్ని ఆపుకోలేక.

ఆ రోజు రాత్రి బెడ్ మీద పడుకొని ఆలోచిస్తున్నాడు శిలాదిత్య. 'ఓహ్... సమీర. నాకివాళ ఎంత సంతోషంగా ఉందో తెలుసా? నిన్ను చూసినంత సంబరం. నా బిడ్డను చూసు కున్నంత ఆనందం. నిజం. ఆరోజు నీ పెళ్ళి యిన మరుసటిరోజు నేను ఢిల్లీ వెళ్ళి పోతుంటే నాకు వీడ్కోలు నివ్వడానికి వచ్చావు. నేస్తం ఆ రోజు నాకింకా బాగా గుర్తుంది.

"మళ్ళీ ఎప్పుడొస్తావు?" ప్రశ్నించావు నువ్వు.

"తెలీదు" అన్నాన్నేను.

"ఇక రావా?" అనడిగావు.

"ఏమో" అన్నాను నిర్లిప్తంగా.

"సృష్టిలో స్నేహమంటే ఏమిటో? దాని విలువేమిటో నాకు సరిగ్గా తెలియజేశావు. నాకు పుట్టబోయే బిడ్డకు నీ పేరే పెట్టుకుంటాను నీలాగే తీర్చి దిద్దుతాను" అన్నావు నువ్వు.

"వొద్దు. మన పవిత్ర స్నేహానికి గుర్తుగా నీ పేరు, నీ పేరు కలిసేలా 'శైల సమీర' అని పెట్టు. నీకు ఆడపిల్ల పుట్టాలనుంది నాకు" అంటూ నీ మంచి వీడ్కోలు తీసుకున్నాను. సమీరా... ఈరోజు నేను నీ కూతుర్ని, శైల సమీరను చూశాను. ఊరికే కాదు. హరివిల్లుకు ముద్దు పెడుతుండగా చూశాను. త్వరలో నిన్ను కలుసుకుంటాను నేస్తం. నేనూ, శైల సమీర ఇద్దరం త్వరలో నీ దగ్గరకు రాబోతున్నాం. శైల సమీర మనిద్దరి జీవితాలకు ఇంద్రధనస్సు కావాలి. ఆ ఇంద్ర ధనస్సు మీదుగా నిన్ను కలుసుకుంటాను నేస్తం" ఇలా ఆలోచనల జల్లుల్లో తడిసి ముద్దవుతున్నాడు శిలాదిత్య.

అక్కడ హాస్టల్లో ఆ రోజు జరిగిన విష యం వాళ్ళ మమ్మీకి లెటర్ వ్రాస్తోంది శైల సమీర. హాస్టల్ లోంచి తీసేస్తానని తిట్టిన ప్రిన్సిపల్ తనను పిలిచి అంత ఆప్యాయంగా ఎందుకు మాట్లాడాడో అర్థం కాలేదా అమ్మాయికి. ఏది ఏమైనా ప్రిన్సిపాల్ సర్ తనతో అంత క్లోజ్‌గా మాట్లాడడం గర్వ కారణం తనకి. ఆలోచిస్తూ లెటర్ వ్రాస్తోంది వాళ్ళ మమ్మీకి.

◊


**రచయిత చిరునామా:**
వై. వర్ణ్య
C/o. హెచ్.ఎస్.యాష్మిన్
D.No. 6-284 (1)
గుడియాత్తం రోడ్, పలమనేరు-
517408